క్లుప్తంగా

వెంకటాద్రిపై వైష్ణవ కృష్ణాష్టమి



పవళింపు సేవ చేస్తున్న అర్చకులు

పెందుర్తి: వైష్ణవ కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్థానిక వెంకటాద్రిపై మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ద్వాదశారాధన జరిపారు. 12 రకాల ప్రసాదాలతో స్వామివారికి నివేదన చేశారు. ఉట్టి సంబరంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని, ఉట్టి కొట్టారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రికి శాస్త్రోక్తంగా స్వామివారికి పవళింపు సేవతో ఉత్సవం ముగిసింది. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ



గరుడసేవలో అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులిచ్చారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా జీవీఎంసీ 88వ వార్డులో నిర్వహించనున్న రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం ఆవిష్కరించారు. ఆరోగ్యవంతులైన యువత రక్తదాన శిబిరంలో పాల్గొనాల్సిందిగా సూచించారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకులు వబ్బిన జనార్దన్ శ్రీకాంత్, మోటూరి కనకరాజు, శ్రీను, నూకరాజు, చిన్నారావు, అశోక్, చలం, గవర శ్రీను, నరేష్, ప్రవీణ్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి పూజలు



పోలమాంబ యూత్ ఫ్రెండ్స్ ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహం

సింహాచలం: 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో పోలమాంబ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి ఐదు రోజుల ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామికి విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ నెల 30న సాయంత్రం ఉట్ల సంబరం, అనంతరం స్వామివారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు యూత్ ఫ్రెండ్స్ సభ్యులు తెలిపారు.

హెచ్‌ఎంలకు శిక్షణ

మల్కాపురం: బాలల హక్కులపై ప్రధానోపాధ్యాయులకు ఎంఈవోలు అవగాహన కల్పించారు. జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలో విజ్ఞాన్ హైస్కూల్ వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ములగాడ మండల పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు డి.వి.త్రినాథరావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, చిన్నారులు చెడు అలవాట్లకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. ప్రముఖ సైకాలజిస్ట్ పార్వతి పాల్గొన్నారు.

ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి



వైద్యులపై దాడులకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. రోగులకు వైద్య సేవలు అందించే వైద్యులను భయపెట్టిన, దాడులకు పాల్పడినా.. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించినపుడే, కోల్‌కతా ఘటనలు పునరావృతం కావు. వైద్యులు భయాల్లేకుండా, ప్రశాంతంగా ఉన్నప్పుడే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించగలరు. విధుల్లో ఉండే వైద్యులకు మరింత రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– డాక్టర్ జయశ్రీ కరిష్మా, ప్రభుత్వ వైద్యాధికారి, పరవాడ



సేవ చేసే వారిని గౌరవించాలి



ఆరోగ్య సమస్యలపై ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఎంతో బాధ్యతగా వైద్య సేవలు అందిస్తాం. మాతో పాటు, నర్సింగ్ సిబ్బంది సేవాభావంతో పనిచేస్తారు. అలాంటి వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. వైద్యులు దేవుడితో సమానమంటారు. ప్రాణం నిలిపే వ్యక్తులను గౌరవించాలి. కోల్‌కతా తరహా ఘటనలు జరగకుండా ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలి. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి కఠిన శిక్ష పడేలా చట్టాలు ఉండాలి.

– డాక్టర్ రొంగలి రేవతి, యూపీహెచ్‌సీ, బుచ్చిరాజుపాలెం

వసతి గతి ఇంతే!

పేదలు, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు.. అందులోనూ ఆడపిల్లలు చదువుకు దూరం కారాదు. వారి భద్రతకు భరోసానిస్తూ, సంపూర్ణ రక్షణ మధ్య చదువుకునేలా ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేసింది. అలాంటిదే మండలంలోని నాయుడుపాలెం శివారు వాడచీపురుపల్లి(మెట్టపాలెం)లో మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన బీసీ బాలికల వసతి గృహం. ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. భద్రత మాట దేవుడెరుక.. ఏ క్షణాన ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడే పరిస్థితి. పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం.. చూస్తున్నారు.. వెళ్తున్నారు.. అంతే..!



శిథిలావస్థకు చేరిన బీసీ బాలికల వసతి గృహం

- శిథిల భవనం.. భయంభయం
- వరండాలోనే టెన్త్ విద్యార్థినులు
- వానొస్తే నిద్ర మాయం!
- పనిచేయని ఆర్వో ప్లాంట్
- తాగునీటికీ తప్పని ఇక్కట్లు
- బాత్‌రూమ్‌కు నీరు మోసుకెళ్లాల్సిందే

60 మంది విద్యార్థినులు

తరగతుల వారీగా విద్యార్థులు

తరగతి	విద్యార్థులు	తరగతి	విద్యార్థులు
3వ	1	7వ	9
4వ	2	8వ	12
5వ	2	9వ	15
6వ	7	10వ	12

పరవాడ: మండలంలోని వెనుకబడిన తరగతుల(బీసీ) బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరింది. 30 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఈ హాస్టల్ ప్రస్తుతం శ్లాబ్‌ల పెచ్చులూడి, నేడో రేపో అన్నట్టుగా మారింది. వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న 60 మంది బాలికలు, నిత్యం భయంభయంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని, హాస్టల్ సిబ్బంది కూడా భయపడుతున్నారు. అధికారులకు చెప్పినా, చర్యలు శూన్యం. దీంతో వేరే దారిలేక భవానికి ఆనుకుని, పక్కనే ఒకే గదితో ఉన్న ఎన్టీపీసీ బిల్డింగ్‌లో పిల్లలకు వసతి కల్పించి, కాలం వెళ్లదీస్తున్నారు.

ఒకే గదిలో 60 మందికి ఆశ్రయం

ఈ వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులున్నారు. ఈ ఏడాది ఇక్కడ 60 మంది విద్యార్థినులు వసతి పొందుతూ, సమీపంలోని స్కూళ్లలో చదువుకుంటున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడం, కనీస నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు ఇందులో ఉండేందుకు భయపడటంతో, పక్కనే ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం నిర్మించిన మరో భవనంలో తలదాచుకుంటున్నారు. అదికూడా ఒకే గది కావడంతో పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అంత మందినీ ఒకే గదిలో ఉంచడంతో చదువుకునేందుకు ఇబ్బందిగా మారి, టెన్త్ విద్యార్థులు వరండాకు మకాం మార్చాల్సి వచ్చింది.



బకెట్‌తో నీటిని మోసుకెళ్తున్న విద్యార్థినులు



ఈ ఇరుకు వరండాయే టెన్త్ విద్యార్థులకు వసతి

వానొస్తే.. పూరి గుడిసె నయం!

రాత్రిపూట నిద్రపోయేందుకు ఎన్టీపీసీ భవనంలో ఉంటున్నా.. దైనందిన కాలకృత్యాలు, భోజనానికి శిథిల భవనమే దిక్కు. వర్షం పడిందంటే.. పూరిగుడిసె కంటే దారుణం. నిల్చుని తినేందుక్కూడా తావుండదు. ఇందులోనే వంట గది ఉంది. చిన్నపాటి వానొచ్చినా గదిలోకి నీరు చేరి, తోడుకునేందుకే సరిపోతుందని వంట పనివారి ఆవేదన. శ్లాబులు పెచ్చులూడి, ఇనుప చువ్వలు దర్శనమిస్తున్నాయి. పిల్లర్లు కూడా బీటలువారాయి. భోజన సమయంలో వాటి నుంచి ఇసుక, చిన్నచిన్న రాళ్లు తినే ప్లేట్లలో పడిన సంఘటనలు చాలా ఉన్నాయని, బాలికలు వాపోతున్నారు.



పెచ్చులూడుతున్న వరండా శ్లాబ్



కూలేందుకు సిద్ధంగా ఉన్న సన్‌షేడ్

పనిచేయని ఆర్వో ప్లాంట్.. పాడైన పైప్‌లైన్

పిల్లల కోసం ఏర్పాటు చేసిన మినీ ఆర్వో ప్లాంట్ నిర్వహణ లేక ఏర్పాటు చేసిన కొన్నాళ్లకే మూలకు చేరింది. దీంతో బోరు నీటిని వేడి చేసుకుని తాగుతున్నారు. కొన్నిసార్లు మరిగించి ఇచ్చే పరిస్థితి కూడా ఉండదు. బాత్ రూంలకు ఏర్పాటు చేసిన వాటర్ పైప్‌లైన్ పాడవడంతో బాలికలు బకెట్లతో నీటిని మోసుకోవాల్సిన దుస్థితి. ఇద్దరేసి పిల్లలు బకెట్లతో నీటిని మోసుకెళ్తూ, తమ అవసరాలు తీర్చుకుంటున్నారు.



అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంట్

భయం భయంగా ఉంటున్నాం



బిల్డింగ్ బాగా పాడైంది. పెచ్చులూడుతున్నాయి. భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నాం. బాత్ రూంలకు మోటారు నుంచి రన్నింగ్ వాటర్ పైప్‌లైన్ పాడైంది. బకెట్లతో నీరు మోసుకోవాల్సి వస్తోంది. పాడైన ఆర్వో ప్లాంట్‌కు రిపేర్లు చేయలేదు. దీంతో పరిశుభ్రమైన తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. అధికారులు దయచూపాలి.

– వై.కీర్తి, ఆరో తరగతి విద్యార్థి

అంతా నిద్రపోయాకే చదువు!



మా హాస్టల్లో టెన్త్ క్లాస్ 12 మంది ఉన్నాం. ఇరుకుగా ఉండే వరండాలో మేమంతా ఉంటున్నాం. హాస్టల్ ఒకే గదిలో ఉండటంతో మిగిలిన తరగతుల పిల్లలూ అక్కడే. వారి గొడవతో మా చదువులు సరిగా సాగట్లేదు. వారు నిద్రపోయాకే మేం చదువుకుంటున్నాం. ప్రత్యామ్నాయ వసతి చూపితే బాగుంటుంది.

– ఇ.గౌతమి, పదో తరగతి విద్యార్థి

కొత్త భవనానికి ప్రతిపాదనలు

విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు చూస్తున్నాం. పాత భవనం వైపు పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణానికి వారం రోజుల క్రితం అధికారులు కొలతలు తీసుకుని వెళ్లారు.

– వై.రజని, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, మెట్టపాలెం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సింహగిరి కొండల్లో విత్తన బంతులు



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగిస్తున్న రామకృష్ణారావు తదితరులు

సింహాచలం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, విత్తన బంతులతో పచ్చదనాన్ని పెంపొందించాలని కృష్ణా యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు సూచించారు. సింహగిరిపై లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దేవతా వృక్షాలు, ఔషధ గుణాలు కల్గిన మొక్కల విత్తనాలతో తయారుచేసిన విత్తన బంతులు జల్లే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పలు రకాల ఔషధాల మొక్కల విత్తనాలు, పేడ కలిపి తయారు చేసిన విత్తన బంతులను కొండల్లోకి విసిరారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి పచ్చదనాన్ని అందించడం మనందరి బాధ్యత అన్నారు. కనుమరుగవుతున్న ఔషధ గుణాలున్న చెట్లను ఎక్కువగా భావితరాలకి అందించాలన్నారు. కనీసం పది మొక్కలనైనా ప్రతి ఒక్కరూ నాటాలని సూచించారు. విత్తన బంతులను తయారుచేసి కొండల్లో వేయడం ద్వారా వర్షాలు పడినప్పుడు అవి తొందరగా భూమిలోకి చొచ్చుకుని, మొక్కలుగా ఎదుగుతాయన్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఏవీబీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ హిల్ ఎర్త్ నినాదంతో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్త్ ఈస్ట్ లయన్స్ అధ్యక్షుడు ఎం.సురేష్, వనితా విభాగం ప్రతినిధి ఎస్.సీతారత్నం, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు వంకాయల సాయినిర్మల, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చర్యలతో టీచర్లపై అదనపు భారం

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు బోధనేతర పనులను పూర్తిగా మినహాయించి.. కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం డిప్యూటీ డీఈవో సువర్ణకు జిల్లా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే సంతోషించామని, కానీ ప్రస్తుత చర్యలు మరింత భారం పెంచేలా ఉన్నాయన్నారు. ఎస్ఎంసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మరుగుదొడ్ల ఫొటోలు తీయకపోతే అందుకు హెచ్ఎంలు బాధ్యత వహించాలనడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రతిరోజూ సాయంత్రం మూడు గంటల నుంచి మూడున్నరలోపు పది అంశాలతో కూడిన గూగుల్ ఫాం పూర్తి చేసి హెచ్ఎంలు అప్‌లోడ్ చేయాలని చెప్పడం అదనపు భారమేన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేద్కర్, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన

'లేకుంటే దశల వారీగా ఆస్పత్రి కార్మికుల ఆందోళన'



డీసీహెచ్ఎస్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

పెందుర్తి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, చెదలు, పురుగుల నివారణ విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు మూడు మాసాలుగా వేతనాల్లేవని, ఇలా అయితే వారి జీవనం ఎలా సాగుతుందని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ ప్రశ్నించారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో(సీహెచ్‌సీ) పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గత మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో మంగళవారం పెందుర్తి సీహెచ్‌సీ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ నిత్యం ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితిని తెలుసుకుని ప్రభుత్వం తక్షణమే వారి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే వచ్చేనెల 1 నుంచి దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీసీహెచ్ఎస్ శంకర్ ప్రసాద్, పెందుర్తి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అవంతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రతినిధి మధు, ఆస్పత్రి కార్మికులు భవాని, నమ్మి లక్ష్మి, కుమార్, అప్పారావు, గురమ్మ, పి.లక్ష్మి, రాజేష్, ఎస్.లక్ష్మి, వరలక్ష్మి, కమలమ్మ, నాయుడు, బి.లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.


నేత్రదానంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ సిబ్బంది

పరవాడ: అన్ని దానాల్లో నేత్రదానం గొప్పదని పరవాడ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ హారిక అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది పరవాడలో మంగళవారం నేత్రదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానం ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మారిక మాట్లాడుతూ ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహించి, నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అప్తాలమిక్ అధికారి ఆర్.వెంకటరావు మాట్లాడుతూ మరణించిన వ్యక్తి నుంచి 6 గంటల్లోపు నేత్రాలను తీసి భద్రపరిస్తే, వాటి ద్వారా వేరొకరికి చూపును అందించవచ్చన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరాం, పీహెచ్ఎన్ జానకీరామన్, హెచ్‌వీ వీపీవీ రత్నం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'భైరవకోన' భక్తులకు సౌకర్యాలు కల్పించండి



కలెక్టర్‌కు భైరవకోన పరిస్థితుల్ని వివరిస్తున్న ఈవో

మహారాణిపేట: సింహాచలం సమీపంలోని భైరవకోన వద్ద భక్తులకు కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సింహాచలం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి, ఇతర అధికారులు మంగళవారం కలెక్టర్‌ను అతని చాంబర్‌లో కలిసి భైరవకోన స్థితిగతులు, అమావాస్య సమయంలో భక్తుల రద్దీ, తదితర అంశాలను వివరించారు. ఈ క్రమంలో భక్తులకు కల్పించాల్సిన కనీస వసతులపై కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు. తాగునీరు సమకూర్చాలని, రాత్రి పూట ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసుల గస్తీ, భక్తులకు అనువుగా సౌకర్యాలు కల్పించాలన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

వీఆర్వోకు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపణ



అసకపల్లిలోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన రేకుల షెడ్

సబ్బవరం: మండలంలోని అసకపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమణలను తొలగించాలని గ్రామానికి చెందిన చింతల త్రినాథ్ రెవెన్యూ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ వీరయ్యకు లిఖితపూర్వక ఫిర్యాదు అందించారు. వివరాలు.. అసకపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెం.164లో సుమారు 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. అందులో తమ పూర్వీకుల నుంచి 20 సెంట్ల భూమి తమ స్వాధీనంలో ఉందని, తప్పుడు ధ్రువపత్రాలతో అక్రమించుకుని షెడ్ నిర్మిస్తున్నారని త్రినాథ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఈ నెల 22న జిల్లా కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ పెట్టుకున్నట్లు తెలిపారు. స్థానిక వీఆర్వో పట్టించుకోకపోవడంతో పూర్తి స్థాయిలో షెడ్ నిర్మించడమే కాకుండా, మరో మూడు షెడ్‌లు నిర్మించారని పేర్కొన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి, సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను తొలగించి, తమకు తమకు న్యాయం చేయాలని కోరారు.

తగ్గిన నీరు.. పెరిగిన పైరు

వర్షాకాలం.. అయినా ఆశించిన స్థాయిలో వర్షాల్లేవు. నగరానికి తాగునీరందించే మేహాద్రిగెడ్డ జలాశయంలో నీటి మట్టం భారీగా తగ్గింది. నిండుగా నీరున్నపుడు పెద్దగా కనిపించని కొండ సైతం బయటపడింది. జలాశయ ఎగువ ప్రాంతంలో కొందరు రైతులు పంటలు వేశారు. దీంతో జలాశయ గర్భం ఆకుపచ్చ వన్నెలద్దుకుని కనువిందు చేస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

